సాక్షి
పశ్చిమగోదావరి
సోమవారం | 29 | మే | 2023



విద్యా కానుక.. అత్యుత్తమంగా..

జగనన్న విద్యాకానుక (జేవీకే) కిట్లను మరింత నాణ్యతా ప్రమాణాలతో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. 8లో ▸



కారుమబ్బులు.. ఈదురుగాలులు

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఆదివారం సాయంత్రం వాతావరణం ఒక్కసారిగా మారింది. కారుమబ్బులు కమ్మి, ఈదురుగాలులు వీచాయి. 8లో ▸

కుంకుళ్లమ్మ ఆలయ వార్షికోత్సవాలు



ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయానికి ఉపాలయమై, క్షేత్ర దేవతగా విరాజిల్లుతోన్న కుంకుళ్లమ్మవారి ఆలయ వార్షికోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. 8లో

న్యూస్‌రీల్

టీడీపీ వైఖరిని నిరసిస్తూ నేడు బైక్ ర్యాలీ



పీవీఎల్ నర్సింహ రాజు, డీసీసీబీ చైర్మన్

కాళ్ల: టీడీపీ అధినేత చంద్రబాబు పేదల ఇళ్ల స్థలాలను స్మశాన వాటికతో పోల్చి దారుణంగా అవమానించడం, అలాగే టీడీపీ దుర్మార్గపు వైఖరిని నిరసిస్తూ సోమవారం భారీ బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్లు డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సోమవారం 7 గంటలకు కాళ్ల మండలం పెదఅమిరంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయం నుంచి ర్యాలీ ప్రారంభమవుతుందన్నారు. కాళ్ల మండలం పెదఅమిరం, జక్కరం, కాళ్ల, జువ్వలపాలెం, ఏలూరుపాడు వంతెన మీదుగా ఆకివీడు మండలం చెరుకుమిల్లి, అయిభీమవరం, ఆకివీడు, మాదివాడ, ఉండి మండలం చెరుకువాడ, కలిసిపూడి, ఉండి మీదుగా తిరిగి పెదఅమిరం చేరుకుంటుందన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు.

పాముకాటుకు మహిళ మృతి



తల్లాడి దుర్గ (ఫైల్)

జంగారెడ్డిగూడెం: చింత చిగురు కోసం వెళ్లగా పాముకాటుకు గురై మహిళ మృతిచెందారు. వివరాలిలా ఉన్నాయి.. జంగారెడ్డిగూడెం శివారు మార్కండేయపురానికి చెందిన తల్లాడి దుర్గ (40) మరో ఐదుగురు మహిళలతో కలిసి సరిహద్దులోని బుట్టాయగూడెం మండలం మర్లగూడెం చింతల అటవీ ప్రాంతంలోకి చింత చిగురు తెచ్చేందుకు వెళ్లారు. వీరంతా చింత చిగురు కోసుకువచ్చి మార్కెట్‌లో విక్రయిస్తారు. చింత చిగురు కోసం వెళ్లిన క్రమంలో దుర్గ పాముకాటుకు గురయ్యారు. తోటి మహిళలు కట్టుకట్టి స్థానిక ఏరియా ఆస్పత్రికి తీసుకువెళ్లగా అప్పటికే ఆమె మృతిచెందినట్టు వైద్యులు నిర్ధారించారు. మృతురాలికి భర్త, ఇద్దరు కుమారులు ఉన్నారు.

రుతుస్రావంపై అవగాహన తప్పనిసరి



మాట్లాడుతున్న మెప్మా పీడీ ఇమ్మాన్యుయేల్

ఏలూరు టౌన్: మానవ జీవితంలో మహిళ సహజమైన భౌతిక ప్రక్రియ నెలసరి అనే విషయాన్ని ప్రతిఒక్కరూ అవగాహనతో ఉండేలా వారి సమాజంలోని వ్యక్తుల భావజాలంలో మార్పునకు మెప్మా తమవంతు ప్రయత్నం చేస్తోందని మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ బి.ఇమ్మాన్యుయేల్ అన్నారు. అంతర్జాతీయ రుతుస్రావ పరిశుభ్రత దినోత్సవం సందర్భంగా ఏలూరు నగరపాలక సంస్థ పాత కౌన్సిల్ హాలులో మెప్మా రిసోర్స్ పర్సన్స్, ఎస్‌హెచ్‌జీ మహిళలు, స్లమ్ ఏరియా పదాధికారులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. యూనిసెఫ్, జాతీయ హెల్త్ మిషన్ సహకారంతో ఆదివారం ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల పరిధిలోని జంగారెడ్డిగూడెం, నూజివీడు, తాడేపల్లిగూడెం, తణుకు, భీమవరం, పాలకొల్లు, నరసాపురం పురపాలక సంఘాల్లోని ఎస్‌హెచ్‌జీ మహిళల పట్టణ సమాఖ్యల ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. మహిళల్లోని అపోహలు తొలగించేలా డాక్టర్లు, ఏఎన్ఎంలు, ఆశాలు మహిళా చైతన్యవంతులను చేశారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు డైరెక్టర్ ఇమ్మాన్యుయేల్ మాట్లాడుతూ భయం నుంచి స్థైర్యం.. బిడియం నుంచి సహజత.. బలహీనత నుంచి సామర్థ్యత ఇలా నెలసరికి సంబంధించిన మార్పులపై చైతన్యవంతులను చేసేందుకు మెప్మా తనవంతు పాత్ర పోషిస్తుందన్నారు. నెలరోజులపాటు స్వయం సహాయక సంఘాల్లో, పట్టణస్థాయి సంఘాల్లో ప్రత్యేక అంశంగా చేర్చి ప్రతిఒక్కరూ అవగాహన కలిగేలా సీఓలు బాధ్యత తీసుకోవాలని ఆయన సూచించారు.

రాట్నాలమ్మకు విశేష పూజలు



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

పెదవేగి: మండలంలోని రాట్నాలకుంటలోని రాట్నాలమ్మవారి ఆలయంలో ఆదివారం విశేష పూజలు జరిగాయి. జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. మండల సచివాలయాల కన్వీనర్ కేశన సతీష్ దంపతులు ప్రత్యేక పూజలు చేయించారు. దేవస్థానం సిబ్బంది ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి సత్కరించారు.

కాలువలను చూస్తే కలవరం

- కాలుష్య కోరల్లో పంట కాలువలు
- నీటిమట్టం తగ్గిన తర్వాత బయట పడుతున్న వ్యర్థాలు
- అధికారుల మధ్య సమన్వయ లోపంతో దుస్థితి
- ప్రక్షాళన పనులు తప్పనిసరి

భీమవరం(ప్రకాశం చౌక్): జిల్లాలో తాగు, సాగునీరు అందించే పంట కాలువలు కాలుష్య కోరల్లో చిక్కుకున్నాయి. చెత్తాచెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలు, పశు కళేబరాలతో అధ్వానంగా మారాయి. కాలువల మూసివేయడంతో నీటిమట్టం తగ్గిన తర్వాత పంట కాలువలో వ్యర్థాలు బయటపడుతున్నాయి. మరలా కాలువలకు నీటి విడుదల చేసేలోపు వీటి ప్రక్షాళన చేపట్టాల్సిన అవసరం ఉంది. లేకుంటే ప్రజారోగ్యానికి ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది.

పశ్చిమ డెల్టా కాలువలన్నీ..

గోదావరి పశ్చిమ డెల్టాకు సంబంధించి అన్ని కాలువలు కలుషితమయ్యాయి. ప్రధాన కాలువలైన ఏలూరు, వెంకయ్య, జీ అండ్ వీ, నరసాపురం కాలువలు, వాటికి అనుసంధానంగా ఉన్న బ్రాంచ్ కాలువలు మొత్తం చెత్తాచెదారాలతో నిండి ఉన్నాయి. జిల్లాలో సుమారు 2.50 లక్షల ఎకరాలకు సాగునీరు, 409 పంచాయతీలు, సుమారు 500 చెరువులకు ఈ కాలువల నీరే ప్రధానం.



లోసరి పంట కాలువ ఇలా..

ఆక్వా చెరువుల మురుగు.. పంట కాలువలకు అనుకుని అనుమతులు లేకుండా సాగు చేస్తున్న రొయ్యల చెరువుల్లో మురుగునీరు, ఇళ్ల నుంచి నేరుగా డ్రెయినేజీ నీళ్లు కాలువల్లో కలుస్తున్నాయి. అలాగే చెత్తాచెదారాలు, ప్లాస్టిక్ వ్యర్థాలను కాలువల్లో పారవేయడం, గట్లను అనుకుని పశువుల పాకలు ఉండటంతో చనిపోయిన పశువులు కళేబరాలు, కోళ్ల వ్యర్థాలు తదితరాలు కాలువల్లో కలుస్తున్నాయి. అలాగే పలు గ్రామాల్లో కాలువ గట్లపై చెత్తాచెదారాలను డంప్ చేయడంతో అవి కూడా కాలుష్యానికి కారణమవుతున్నాయి.

జిల్లాలో ఇలా..

ఇరిగేషన్ సబ్ డివిజన్లు	
ఉండి, తణుకు, తాడేపల్లిగూడెం, నరసాపురం	
ప్రధాన కాలువలు 4	బ్రాంచ్ కాలువలు 150



జీ అండ్ వీ పంట కాలువ గట్టుపై చెత్తాచెదారం

చర్యలేవి.. జిల్లాలో పంట కాలువల అధ్వానంగా మారుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. నీటిపారుదల, పంచాయతీ శాఖల అధికారుల మధ్య సమన్వయ లోపం కారణంగా కనిపిస్తోంది. అలాగే కలుషితానికి కారణాలు తెలుసుకుని నివారణ చర్యలు చేపట్టకపోవడం కూడా సమస్యకు అద్దం పడుతోంది. నూతన జిల్లాగా ఏర్పడిన తర్వాత ఉన్నతస్థాయి అధికారులు అందుబాటులోకి వచ్చారు. అధికారులు స్పందించి పంట కాలువల ప్రక్షాళన పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



అధ్వానంగా ఉన్న అనాకోడేరు పంట కాలువ

ఓటమి విజయానికి నాంది

మంత్రి కారుమూరి



విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న మంత్రి కారుమూరి

సాక్షి, భీమవరం: ఓటమి విజయానికి నాంది అని, గెలుపోటములను సమానంగా స్వీకరించాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం స్థానిక డీఎన్నార్ కళాశాల మైదానంలో కారుమూరి దివ్యాంగుల క్రికెట్ ప్రీమియర్ లీగ్ పోటీలను ఆంధ్రా క్రికెట్ ఫెడరేషన్ ఆఫ్ దివ్యాంగుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఫైనల్స్‌లో సెంట్రల్ జోన్ జట్టుపై కారుమూరి జట్టు విజయం సాధించింది. అనంతరం విజేతలకు మంత్రి కారుమూరి బహుమతులు అందించారు. దివ్యాంగుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు. భవిష్యత్‌లో దివ్యాంగులను ప్రోత్సహించేలా మరిన్ని టోర్నమెంట్లు నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా పలువురికి ఆర్థిక సాయాన్ని అందించారు. ఆర్డీఓ దాసి రాజు, తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీఓ శ్రీరామ చంద్ర ప్రభు, డీఎన్నార్ పాలకవర్గ సభ్యుడు శివరామరాజు పాల్గొన్నారు.

అంబేడ్కర్ బాటలో ప్రజా సంక్షేమం

పెనుగొండ: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాటలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నడుస్తూ ప్రజలకు సంక్షేమాన్ని అందిస్తున్నారని శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు అన్నారు. ఆదివారం ములపర్రులో ఎస్సీ తొమ్మిది సంఘాల మినీ భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో భారతదేశం పటిష్టంగా ఉండటానికి ప్రధాన కారకులు అంబేడ్కర్ అన్నారు. వారి ఆశయ సాధనకు యువత కృషి చేయాలని పిలుపునిచ్చారు. మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు మాట్లాడుతూ దేశంలో ఎక్కడాలేని విధంగా దళితుల సంక్షేమానికి సీఎం జగన్ కట్టుబడి ఉన్నారన్నారు. అన్నింటా వారికి అధిక ప్రాధాన్యమిస్తున్నారన్నారు. ప్రతిపక్షాలు సంక్షేమాన్ని చూసి ఓర్వలేక ప్రజలను మభ్యపెట్టాలని ప్రయత్నిస్తున్నాయని విమర్శించారు. ప్రతి ఇంటికీ సంక్షేమాన్ని అందించి లబ్ధి చేకూరుస్తున్నామని, మరింత లబ్ధిని చేకూర్చేందుకు సీఎం జగన్ కట్టుబడి ఉన్నారన్నారు. ఎంపీపీ పూతినీడి వెంకటేశ్వరరావు (పెద్ద), మండల కన్వీనరు నలిమిల్లి వేణుప్రతాపరెడ్డి (బాబిరెడ్డి), సర్పంచ్ మద్రే రాజేశ్వరిప్రసాద్, ఏఎంసీ డైరెక్టర్ కుసుమే రాంబాబు, ఆంధ్రప్రదేశ్ ఉమెన్ కో–ఆపరేటివ్ కార్పొరేషన్ డైరెక్టర్ బొక్కా అరుణ, ఎస్సీ సంఘాల నాయకులు మద్రే అబ్రహం, కేసరపల్లి గిరి, కొల్లాటి అబ్బులు, తవిటికి సత్యనారాయణ, బళ్ల బద్రి, కె.సుబ్రహ్మణ్యం, కేశరపల్లి రమేష్, కలగట్ల సాగర్ తదితరులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు

లయన్స్ ఇంటర్నేషనల్ రాష్ట్ర చైర్మన్‌గా వంకా

కాళ్ల : లయన్స్ ఇంటర్నేషనల్ రాష్ట్ర చైర్మన్‌గా ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండలంలోని పెదఅమిరం రాధాకృష్ణ కన్వెన్షన్ హాలులో రెండు రోజులుగా నిర్వహిస్తున్న లయన్స్ ఇంటర్నేషనల్ మల్టీడిస్ట్రిక్ట్ అంతర్జాతీయ సదస్సు ఆదివారంతో ముగిసింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్ మాట్లాడుతూ లయన్స్ క్లబ్ అంటేనే ఒక సేవా రంగమని, 100 ఏళ్ల సుదీర్ఘ చరిత్ర ఉందని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో 12 వేల మంది, దేశంలో 3 లక్షల మంది, ప్రపంచవ్యాప్తంగా 15 లక్షల మంది సభ్యులు ఉన్నారని, 400 క్లబ్‌లు ఉన్నాయని తెలిపారు. తామంతా సమూహంగా సైన్యంగా సేవలు చేస్తూ పనిచేస్తామని తెలిపారు. అనంతరం నూతనంగా రాష్ట్ర చైర్మన్‌గా ఎన్నికైన రవీంద్రనాథ్‌ను సభ్యులు సత్కరించారు. ఉత్తమంగా సేవలందిస్తున్న అధ్యక్ష, కార్యదర్శులకు ఉత్తమ సేవా అవార్డులను అందించారు. ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ ఏపీ సింగ్, ఫస్ట్ ఇంటర్నేషనల్ డైరెక్టర్లు వి.విజయ్‌కుమార్ రాజు, చిగురుపాటి వరప్రసాద్, ఆర్గనైజింగ్ చైర్మన్ సీహెచ్ కృష్ణంరాజు, జాయింట్ సెక్రటరీ కొమ్ముల మురళీకృష్ణ, భీమవరం క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు నందమూరి రాజేష్, నరహరిశెట్టి కృష్ణ, డిస్ట్రిక్ట్ గవర్నర్ దామర్ల శ్రీశాంతి పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్‌ను అభినందిస్తున్న దృశ్యం

వలంటీర్లు.. సంక్షేమ వారధులు

ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్

పాలకొల్లు అర్బన్: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి వలంటీర్లు వారధులుగా పనిచేసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మానసపుత్రులుగా నిలిచారని శాసనమండలి సభ్యుడు (ఎమ్మెల్సీ), నియోజకవర్గ ఇన్‌చార్జి కవురు శ్రీనివాస్ అన్నారు. పాలకొల్లు మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం మండలంలోని వలంటీర్లకు పురస్కారాలు అందించి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవరత్నాలను ప్రజలకు అందించడంలో వలంటీర్లదే కీలక పాత్ర అన్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడంలో మరింత ఉత్తమ సేవలందించాలని సూచించారు. సేవా వజ్ర పురస్కారం దార్ల విష్ణుకుమారి (దగ్గులూరు), సేవా రత్న పురస్కారాలు రాపాక సువర్ణరాజు (దిగమర్రు), దాసరి మలాకి (వాలమర్రు), అందే జగన్ సురేష్ (చింతపర్రు), నిల్లా తులసీలక్ష్మి (దగ్గులూరు), విశ్వనాథం గణేష్ (భగ్గేశ్వరం)కు అందించి సత్కరించారు. ఎంపీపీ చిట్టూరి కనకలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు నడపన గోవిందరాజులనాయుడు, మాజీ ఎమ్మెల్సీ మేకా శేషుబాబు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ, వైస్ ఎంపీపీ పడవల సునీల్‌బాబు, ఎంపీటీసీ చింతపల్లి సాయిబాబా, పార్టీ మండల కన్వీనర్ ఎం.మైఖేల్‌రాజు, సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షుడు గుమ్మాపు పెద్దిరాజు, కడలి నాగమణి, విశ్వనాథం కనకభద్రం, రాపాక నగేష్ కరుణాకర్, ఎంపీడీఓ సంగాని వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



పోడూరులో వలంటీర్లను సత్కరిస్తున్న ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్

అన్నివర్గాల సంక్షేమమే లక్ష్యం

పోడూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో అన్నివర్గాల సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని, దీనిలో వలంటీర్ల రథసారథులని ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్ అన్నారు. పోడూరు మండలపరిషత్ కార్యాలయంలో ఆదివారం వలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా పాలకొల్లు నియోజకవర్గ పరిధిలోని ఎనిమిది గ్రామాల వలంటీర్లను సత్కరించి అవార్డులు అందించారు. వలంటీర్ వ్యవస్థ ద్వారా కులమతాలు, పార్టీలు, వర్గాలకు అతీతంగా సంక్షేమ ఫలాలు అందిస్తున్నామన్నారు. వలంటీర్ల సేవలు రాష్ట్రానికే గర్వకారణమన్నారు. రానున్న ఎన్నికల్లోనూ వైఎస్సార్‌సీపీ అఖండ విజయం సాధించి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. జెడ్పీఫ్లోర్ లీడర్ గుంటూరి పెద్దిరాజు, ఎంపీపీ సబ్బితి సుమంగళి సాగర్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ, పోడూరు సర్పంచ్ శెట్టిబత్తుల సువర్ణరాజు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి డీటీడీసీ బాబు, వైస్ ఎంపీపీలు ఇందుకూరి సీతారామరాజు, గుబ్బల సత్యనారాయణ, ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ పెదపాటి పెద్దిరాజు, ఏపీ సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ పోతుమూడి రామచంద్రరావు, ఎంపీడీఓ ఎం.బలరామరాజు, జేసీఎస్ కన్వీనర్ బళ్ల రాజశేఖర్, పెనుమదం సొసైటీ చైర్మన్ కొప్రపాటి వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శం

చింతలపూడి: రాష్ట్రంలో అమలవుతున్న వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిందని ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా అన్నారు. స్థానిక ఆర్ఆర్ కల్యాణ మండపంలో ఆదివారం వలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా గ్రామ, వార్డు వలంటీర్లను సత్కరించారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జగ్గవరపు జానకీరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడుతూ రాష్ట్రంలో అర్హులందరికీ కులం, మతం, పార్టీ, వర్గం చూడకుండా వలంటీర్ల ద్వారా పారదర్శక సేవలందిస్తున్నామన్నారు. సచివాలయాల ద్వారా మెరుగైన సేవలు అందించడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఉద్దేశమన్నారు. దేశంలోని పలు రాష్ట్రాలు వలంటీర్ వ్యవస్థపై ఆసక్తి చూపుతున్నాయన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను చంద్రబాబు అడ్డుకోవాలని చూస్తున్నారని, ఇటువంటి వారికి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. వలంటీర్లను ప్రోత్సహించే ఉద్దేశంతో అవార్డులు అందిస్తున్నామన్నారు. మరింత మెరుగైన సేవలు అందించాలని సూచించారు. జెడ్పీటీసీ ఎం.నీరజా సుధాకర్, నగర పంచాయతీ కమిషనర్ ఎస్. రాంబాబు, వైస్ ఎంపీపీలు వరలక్ష్మి, గుత్తా కిషోర్, పార్టీ పట్టణ కన్వీనర్ కొప్పుల నాగేశ్వరరావు, మండల సచివాలయాల కన్వీనర్ త్సల్లాబత్తుల శ్రీనివాసరావు, నగర పంచాయతీ సచివాలయాల కన్వీనర్ ఎస్.దుర్గారావు, సొసైటీ అధ్యక్షుడు చుండూరి నాగేశ్వరరావు, అలవాల బాబు, ఎంపీడీఓ మణికుమారి పాల్గొన్నారు.



వలంటీర్లను సత్కరిస్తున్న ఎమ్మెల్యే ఎలీజా

కారుచీకట్లలో కాంతిరేఖ

- అక్షర జ్యోతులు వెలిగిస్తున్న అంధురాలు
- రచన, వచన, సంగీతం, గాత్రం, విద్యలో అసమాన ప్రతిభ
- వర్సిటీ విద్యార్థులకు పాఠ్యాంశంగా ఆమె కవిత
- మాజీ రాష్ట్రపతి, ప్రధాని నుంచి ప్రశంసలు
- ఆదర్శంగా నిలుస్తున్న జ్యోత్స్న ఫణిజా

కైకలూరు: చీకట్లో చిరుదివ్వెలా.. నిశీధిలో కాంతి పుంజంలా.. అసమాన ప్రతిభతో ఆదర్శంగా నిలుస్తున్నారు అంధురాలు బొల్లా జ్యోత్స్న ఫణిజా. విద్య, సంగీతం, రచన, వచన, గానం, అనువాదం, బోధన ఇలా పలు రంగాల్లో రాణిస్తూ దేశ, విదేశాల్లో ప్రశంసలు పొందుతున్నారు. ఆమె గాత్రం ఓ మధురస్వరం.. కంప్యూటర్ కీబోర్డు ఆమె క్లోజ్ ఫ్రెండ్.. మనోనేత్రంతో అక్షర జ్యోతులు వెలిగిస్తున్నారు.. ఢిల్లీ యూనివర్సిటీ విద్యార్థులకు పాఠ్యాంశంగా ఆమె కవిత చేరడం గర్వించదగిన విషయం.

ఆంగ్ల సాహిత్యంలో రాణిస్తూ..

ఏలూరు జిల్లా కైకలూరుకు చెందిన బొల్లా అభిమన్యుకుమార్, సత్యవతి కుమార్తె జ్యోత్స్న ఫణిజా పుట్టుకతో అంధురాలు. అయినా తల్లిదండ్రులు ఏమాత్రం కుంగిపోలేదు. చిన్నతనం నుంచి ఆమెను అన్నిరకాలుగా ప్రోత్సహించారు. జ్యోత్స్న ప్రాథమిక విద్యాభ్యాసం నరసాపురం అంధుల పాఠశాల, ఇంటర్ కైకలూరు, డిగ్రీ విజయవాడలో పూర్తిచేశారు. ఇంగ్లిష్ అండ్ ఫారెన్ లాంగ్వేజెస్‌లో ఎంఏ ఆంగ్ల సాహిత్యం, ఇదే అంశంలో పీహెచ్‌డీ డాక్టరేట్, అడ్వాన్స్ కంప్యూటర్ ట్రెనింగ్ కోర్సు, ఢిల్లీ యూనివర్సిటీ ఇంగ్లిష్ హెడ్ ఆఫ్ ద డిపార్ట్‌మెంటుగా ఇలా చదువులో ఉన్నత శిఖరాలను అధిరోహించారు. ఫెయిర్ అండ్ లవ్లీ మెరిట్ స్కాలర్‌షిప్‌తో పాటు మిస్ కాలేజీ రన్నరప్‌గానూ ఆమె నిలిచారు.

సంగీతం.. ఆమె ప్రాణం

జ్యోత్స్న ఫణిజా కర్ణాటక, హిందూస్థానీ సంగీతంలో ప్రావీణ్యం పొందారు. కువైట్ తెలుగు కళాసమితి నిర్వహించిన సంగీత స్వరనీరాజనంలో సత్తా చాటారు. 'సాక్షి టీవీ' నిర్వహించిన 'కచేరి' సంగీత కార్యక్రమంలో ప్రతిభ చూపారు. అలాగే పలు టీవీ చానళ్లు నిర్వహించిన సంగీత కార్యక్రమాల్లో ప్రతిభ చాటారు. దూరదర్శన్ సప్తగిరి చానల్ 'ఆలపాన' కార్యక్రమంలో పలు గీతాలు ఆలపించారు. హైదరాబాద్ త్యాగరాయ గానసభ, రవీంద్రభారతి వేదికలపై సంగీత కచేరీలు ఇచ్చారు.

కవితల్లో ఘనాపాటి

ఢిల్లీ యూనివర్సిటీ ఇంగ్లిష్ ఆనర్స్ మూడో సంవత్సర సిలబస్‌లో జ్యోత్స్న రాసిన 'సీ' కవితను పాఠ్యాంశంగా చేర్చారు. ఇప్పటివరకూ ఆమె 120 వరకు కవితలు రాశారు. అమెరికా, లండన్, మలేషియా, కెనడా, ఇంగ్లిష్ మేగజైన్లలో ఆమె ప్రచురితమయ్యాయి. ప్రముఖ కవి మోపూరు పెంచల నరసింహం తెలుగులో రచించిన రెండు కవితా సంపుటాలను క్రింసన్ లేంప్, స్టోండ్ సాంగ్ పేరుతో ఆమె అనువదించారు. ఆమె రాసిన 'నేడు కురిసిన వాన' కవితకు నాటా (నార్త్ అమెరికన్ తెలుగు అసోసియేషన్) కవితా పురస్కారం దక్కింది. పెన్నా రచయిత సంఘం ఉగాది పురస్కారం, సత్యశ్రీ సాహితీ పురస్కారం, రాధేయ ఉత్తమ పురస్కారం, పాతూరి మాణిక్యమ్మ స్మారక పురస్కారం వంటివి ఆమె అందుకున్నారు.

25 ఏళ్లకే పీహెచ్‌డీ : ఫారెన్ లాంగ్వేజెస్ అంశంపై 25 ఏళ్లకే ఆమె పీహెచ్‌డీ సాధించి 2017లో అప్పటి రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ చేతులమీదుగా జాతీయ అవార్డు అందుకున్నారు. అలాగే ఆమె రాసిన సిరామిక్ ఈవ్‌నింగ్ పుస్తకాన్ని చదివిన ప్రధాని మోదీ అభినందన లేఖను పంపారు. వరల్డ్ ఐ రైట్ ఇన్ పుస్తకానికి ఎడిటర్‌గా ఆమె కూడా పని చేశారు. 2009లో దగ్గర బంధువు రాధాకృష్ణను ఆమె వివాహం చేసుకున్నారు. వీరికి ఇద్దరు సంతానం. కుమారుడు హరిచందన్ ఆదిత్య చిన్నతనం నుంచే కవితా రచనలో ఆసక్తి చూపుతున్నాడు. అతడు రాసిన జాస్మిన్ బడ్స్ అనే కవిత డిఫరెంట్ ట్రూట్స్ అనే మేగజైన్‌లో ప్రచురితమయ్యింది.

అవార్డుల పరంపర : ఆమె వక్తృత్వం, వ్యాసరచన, క్విజ్ పోటీల్లో 100 వరకు బహుమతులు సాధించారు. రెటీనా ఇండియా అవార్డు, బాలా మెమోరియల్ అవార్డు, సంఘ మిత్ర అసోసియేస్ అంతర్జాతీయ వికలాంగ దినోత్సవ అవార్డు, స్వరం ఓ వరం సంగీత సన్మానం, ఏలూరు వెల్ఫేర్ సొసైటీ మహిళా దినోత్సవ సన్మానం, సరిగమ సంగీత పరిషత్ అవార్డు, ఆంధ్రప్రదేశ్ ప్రతిభా పురస్కారం, ధీరూబాయ్ అంబానీ స్కాలర్‌షిప్, ఫెయిర్ అండ్ లవ్లీ ప్రతిభ పురస్కారం పొందారు. ఆత్మారాం సనాతన్ ధర్మా కాలేజీ, ఢిల్లీ విశ్వవిద్యాలయంలో 2015లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆమె ఇంగ్లిష్ హెడ్ ఆఫ్ ద డిపార్ట్‌మెంటుగా యూనివర్సిటీ క్వశ్చన్ పేపర్ సెట్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు.



విద్యార్థులకు ల్యాప్‌టాప్‌తో క్లాసులు చెబుతూ..



మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నుంచి జాతీయ అవార్డు అందుకుంటున్న జ్యోత్స్న (ఫైల్)

మహిళా శక్తి ఎంతో గొప్పది

మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి. విద్యార్థులకు మాతృభాషలో సాహితీ విలువలను నేర్పించాలి. సమాజంలో మహిళలపై వివక్ష చూపరాదు. మనం సంపాదించిన డబ్బుతో ఒకరి ఆకలి తీర్చండి, తెలిసిన విద్యను నేర్పించి ఉపాధి మార్గం చూపండి. దివ్యాంగులు అన్ని రంగాల్లో రాణించవచ్చు. ప్రతిఒక్కరూ లక్ష్యంతో ముందుకు సాగాలి.

– జ్యోత్స్న ఫణిజా, సాహితీవేత్త, కైకలూరు

జగనన్న విద్యాకానుక.. అత్యుత్తమంగా..

పేద కుటుంబాల ఆర్థిక పరిస్థితి మెరుగుపడాలంటే.. వారి బిడ్డలకు మంచి విద్యనందించాలనే సమున్నత లక్ష్యంతో ముందుకెళుతున్న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.. రాష్ట్రంలో విద్యకు పట్టం కడుతున్నారు. ప్రభుత్వ పాఠశాలలను నాడు–నేడు పేరుతో మున్నెన్నడూ చూడని స్థాయిలో అభివృద్ధి చేస్తూ.. విద్యార్థులకు అన్ని సౌకర్యాలూ అందేలా చర్యలు తీసుకుంటున్నారు. అందులో భాగంగా అందిస్తున్న జగనన్న విద్యా కానుక కిట్లను ఈ ఏడాది అత్యుత్తమ నాణ్యతతో అందించేందుకు ఏర్పాట్లు చేశారు.

- ఖరీదైన బ్యాగ్.. సౌకర్యవంతమైన బూట్లు
- ఆకర్షణీయమైన చెక్స్ యూనిఫాం.. పెరిగిన క్లాత్ పరిమాణం
- ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో పంపిణీకి చురుగ్గా ఏర్పాట్లు
- బడితెరిచే నాటికి పాఠశాల పాయింట్ వద్దకే కిట్లు

సాక్షి, పశ్చిమగోదావరి డెస్క్: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తూ అందించే జగనన్న విద్యాకానుక (జేవీకే) కిట్లను మరింత నాణ్యతా ప్రమాణాలతో అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఈ కిట్‌లోని వస్తువుల నాణ్యతపై పాఠశాల విద్యాశాఖ ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. ఇప్పటికే పలుమార్లు ఆయనే స్వయంగా బ్యాగ్‌లు, షూల తయారీ యూనిట్ల గోడౌన్‌ల వద్దకు వెళ్లి పంపిణీదారులకు తగిన సూచనలు జారీ చేశారు. ఆయన జిల్లాల పర్యటనలో భాగంగా మండలాలకు చేరుతున్న జేవీకే కిట్ల నాణ్యత, స్టోర్ చేసే రూములను తనిఖీ చేస్తున్నారు. ఈ విద్యాసంవత్సరం పాఠశాల పునః ప్రారంభం తేదీలోపు సకాలంలో ఇండెంట్‌లోని ప్రతి వస్తువూ పాఠశాల పాయింట్ వద్దకు చేరుకునేలా ఇప్పటికే ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అధికారులకు ఆయన ఆదేశించారు. గతంలో జేవీకే కిట్స్ పంపిణీలో తలెత్తిన చిన్న చిన్న లోపాలను సైతం ఈ విద్యాసంవత్సరంలో పునరావృతం కాకుండా చూసుకోవాలని ఆయన జిల్లా విద్యాశాఖ అధికారులకు సూచించారు. ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో ప్రభుత్వ పాఠశాలల పట్ల పెరుగుతున్న ఆదరణ, ఏటా అదనంగా చేరుతున్న విద్యార్థులను దృష్టిలో పెట్టుకుని ఐదు శాతం అదనపు స్టాక్‌ను ప్రభుత్వం పంపిణీ చేస్తున్నట్టు అధికారులు చెబుతున్నారు.



స్కూల్ బ్యాగ్‌లను కొలుస్తున్న విద్యా శాఖ ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ (ఫైల్)

ఏటా పెరుగుతున్న నాణ్యత

గతంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, రెండు జతల యూనిఫాం మాత్రమే ఇచ్చేవారు. అదీ విద్యాసంవత్సరం ప్రారంభమైన నాలుగైదు నెలలు తర్వాత కూడా అందేవి కావు. ముఖ్యమంత్రిగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించిననాటి నుంచి ప్రభుత్వ విద్యారంగంలో అనేక సంస్కరణలు తీసుకొస్తూనే ఉన్నారు. పాఠశాలలు తెరిచే నాటికే ప్రతి ప్రభుత్వ విద్యార్థి చేతిలో పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, వర్క్‌బుక్స్, నోట్ పుస్తకాలు, షూలు, సాక్స్‌లు, బెల్టు, బ్యాగ్ ఉండేలా జగనన్న విద్యాకానుక పథకానికి శ్రీకారం చుట్టారు. తెలుగు మీడియంతో పాటు సమాంతరంగా ఇంగ్లీషు మీడియం అర్థమయ్యేలా ఒకవైపు తెలుగు, మరోవైపు ఇంగ్లీష్ భాషలో (మిర్రర్ బుక్స్) పాఠ్యపుస్తకాలు ముద్రించి ప్రభుత్వ విద్యార్థులకు అందిస్తున్నారు.



జగనన్న విద్యాకానుక కిట్‌లో అందించే వస్తువులు ఇవే..

ఆకర్షణీయమైన చెక్స్ యూనిఫాం..

విద్యార్థులకు ఈ విద్యా సంవత్సరంలో అందించే యూనిఫాం గతానికి భిన్నంగా మరింత ఆకర్షణీయంగా డిజైన్ చేశారు. బాలికల టాప్, బాలుర షర్ట్‌లను ప్లెయిన్ క్లాత్ నుంచి గడుల రూపంలోకి మార్పు చేశారు. దుస్తులను కుట్టే సమయంలో సమస్యలు ఎదురు కాకుండా క్లాత్ పరిమాణాన్ని దాదాపు 20 శాతం పెంచారు.

ఈసారి మూడు జతలు..

గతంలో మాదిరిగా రెండు జతల యూనిఫాం కాకుండా మూడు జతలు అందించనున్నారు. వీటి తయారీ కోసం మఫత్‌లాల్ ఇండస్ట్రీ లిమిటెడ్, నందన్ డెనిమ్ లిమిటెడ్, కంచన్ ఇండియా లిమిటెడ్, అరవింద్ కాట్సిన్ ఇండియా లిమిటెడ్ సంస్థలను టెండర్ల ద్వారా ఎంపిక చేసినట్టు అధికారులు తెలిపారు. యూనిఫాంకు సంబంధించిన వస్త్రం ఇప్పటికే ప్రతి మండల పాయింట్లకూ చేరుకుంది.

మరింత నాణ్యతతో బూట్లు, బ్యాగ్‌లు

బూట్లు, బ్యాగ్‌లు మరింత నాణ్యతతో అందించేలా ఓపెన్ టెండర్స్ విధానంలో తయారీ సంస్థలను ఎంపిక చేశారు. బూట్లు మరింత కాంతివంతంగా ఉండేలా చర్యలు తీసుకున్నారు. సరఫరాదారులు పాత మెటీరియల్ వాడకుండా నియంత్రించారు. డైమండ్ ఫూట్‌కేర్, ఉద్యోగ్ ప్రైవేట్ లిమిటెడ్, మంజీత్ ప్లాస్టిక్ ఇండస్ట్రీ తదితర సంస్థలకు టెండర్ల ద్వారా ఆర్డర్లు ఇచ్చారు. నాణ్యమైన బ్యాగులను సరఫరా చేసేందుకు మంజీత్ ప్లాస్టిక్ ఇండస్ట్రీస్ కోర్స్ ఇండియా లిమిటెడ్, అభిలాష కమర్షియల్, ఎక్స్‌వో ఫుట్‌వేర్, వినిష్మా టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలను టెండర్ల ద్వారా ఎంపిక చేసి ఆర్డర్లు ఇచ్చారు. స్క్వేర్ టైపులో పెద్ద బ్యాగులు రీ డిజైన్ చేశారు. ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీల ప్రింటింగ్ ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ ప్రెస్‌కి నామినేషన్ ప్రాతిపదికన అందించారు. బెల్టుల తయారీ స్పోర్ట్స్ ఉపకరణాల సంస్థలకు అప్పగించారు. అటల్ ప్లాస్టిక్స్, ఓం స్పోర్ట్స్ సంస్థలను బెల్టుల తయారీకి టెండర్ల ద్వారా ఎంపిక చేశారు.

రెండు భాషల్లో పాఠ్యపుస్తకాలు

ఒకటి నుంచి తొమ్మిదో తరగతి వరకు ద్విభాషా పాఠ్యపుస్తకాలు ప్రచురిస్తున్నారు. దీంతో తెలుగు, ఆంగ్లం మాధ్యమాల్లోనూ, ఉర్దూ మీడియం అయితే ఉర్దూ, ఇంగ్లీష్‌లలో పాఠ్యపుస్తకాలు సరఫరా చేయనున్నారు. ఈ విధంగా తెలుగు, ఉర్దూ, కన్నడ, ఒరియా, తమిళ భాషల్లో ముద్రించారు. ఈ విద్యాసంవత్సరం నుంచి 6, 7, 9 తరగతుల విద్యార్థుల కోసం ఎన్‌సీఈఆర్టీ సిలబస్‌తో పాఠ్యాంశాలను మిర్రర్ విధానంలో తెలుగు, ఇంగ్లీషు భాషల్లో ముద్రించారు. తమిళనాడు న్యూస్‌ప్రింట్ పేపర్స్ లిమిటెడ్ కాగితం సరఫరా చేసింది. రెండు సెమిస్టర్ల విధానంలో పుస్తకాలు సరఫరా చేస్తున్నారు.

ఇండెంట్ ఇలా

ఏలూరు జిల్లాలో

స్కూల్ బ్యాగ్స్	1,55,998
బెల్టులు	1,10,234
తెలుపు, రూళ్ల, గ్రాఫ్ నోట్స్‌లు	9,30,123
బూట్లు	1,57,244 జతలు
సాక్స్‌లు	1,57,244 జతలు
3 జతల యూనిఫాం క్లాత్‌లు	1,55,998
ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీలు	29,247

పశ్చిమగోదావరి జిల్లాలో

స్కూల్ బ్యాగ్స్	1,13,584
బెల్టులు	78,474
తెలుపు, రూళ్ల, గ్రాఫ్ నోట్స్‌లు	7,24,466
బూట్లు	1,13,431 జతలు
సాక్స్‌లు	1,13,431 జతలు
3 జతల యూనిఫాం క్లాత్‌లు	1,13,580
ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీలు	12,633

ఇండెంట్ కంటే 5 శాతం బఫర్ స్టాక్



ఇండెంట్ కంటే ఈసారి అదనంగా ఐదు శాతం బఫర్ స్టాక్ ప్రభుత్వం పంపిణీ చేయనుంది. ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో ప్రభుత్వ పాఠశాలల పట్ల పెరుగుతున్న ఆదరణ, ఏటా అదనంగా చేరుతున్న విద్యార్థులను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.
– రవిసాగర్, డీఈవో, ఏలూరు

క్లుప్తంగా

భీమవరంలో అండర్-19 చెస్ పోటీలు



అండర్ 19 చెస్ చాంపియన్‌షిప్ విజేతలకు బహుమతులు అందచేస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: పశ్చిమగోదావరి జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భీమవరంలోని అనసూయ చెస్ అకాడమీలో అండర్–19 రాష్ట్రస్థాయి చెస్ పోటీలు ఆదివారం జరిగాయి. జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు మాదాసు కిషోర్ మాట్లాడుతూ చదరంగం ద్వారా విద్యార్థుల్లో దాగి ఉన్న మేధా శక్తి, సమయస్ఫూర్తి బయటకు వస్తాయని చెప్పారు. పోటీల్లో గెలుపొందిన నలుగురు విజేతలు జూన్ 8 నుంచి 11 వరకు నంద్యాలలో జరిగే అండర్–19 పోటీలకు జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. విజేతలుగా నిలిచిన ఎం.మౌర్య రామ సూర్య, ఎల్. పవన్ సిద్దేష్, ఎ.జీవన్ సాయి, టి. శివసాయిలకు ప్రశంసా పత్రాలు, మెమెంటోలు అందజేశారు. కార్యక్రమంలో అడబాల దుర్గారాణి, మైలాపురి మురళి, అల్లు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సుదర్శన చక్ర ప్రతిష్ట

కొయ్యలగూడెం : రుక్మిణీ సత్యభామ సమేత మదన గోపాలస్వామి ఆలయంలో ధ్వజస్తంభంపై సుదర్శన చక్రాన్ని ఆదివారం ఘనంగా ప్రతిష్ఠించారు. సుమారు 250 సంవత్సరాల క్రితం మదన గోపాల స్వామి ఆలయాన్ని నిర్మించి ఆలయ శిఖరంపై సుదర్శన చక్రాన్ని ఆనాడు ప్రతిష్టించారు. సుదర్శన చక్రమహిమ రీత్యా దానిని తిరిగి మళ్లీ మెరుగులు దిద్ది ధ్వజ స్తంభంపై ప్రతిష్టించారు. గతంలో ఆలయ సందర్శన సమయాల్లో పలువురు పీఠాధిపతులు స్వామివారిని దర్శించుకున్న అనంతరం ఆలయ శిఖరంపై ఉన్న సుదర్శన చక్ర దర్శనం చేసుకునేవారని చెబుతారు.

డీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడిగా నరహరి



ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డీటీఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడిగా ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన కే.నరహరి 4వ సారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గుంటూరులోని నవీన్ విద్యా సంస్థల్లో ఈ నెల 27వ తేదీన నిర్వహించిన డీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో రాష్ట్ర నూతన కార్యవర్గ ఎన్నిక జరిగిందిందని జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.ఆదినారాయణ తెలిపారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా జిల్లాకు చెందిన ఎస్.శ్రీనివాసరావు, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా కే.సురేష్ కుమార్‌లు ఎన్నికయ్యారని తెలిపారు.



కుకునూరు: ఈదురుగాలుల ధాటికి ఉప్పేరు వాగు వద్ద కూలిన చెట్టు



బుట్టాయిగూడెం: జీలుగుమిల్లి మండలం బర్రింకలపాటు సమీపంలో..



కొమరవరంలో ఈదురు గాలులకు నేలకొరిగిన చెట్టు

కారుమబ్బులు.. ఈదురుగాలులు

తాడేపల్లిగూడెం: ఆదివారం సాయంత్రం తాడేపల్లిగూడెం పట్టణం మొత్తం కారుమబ్బులు కమ్మి ఈదురుగాలులు వీచాయి. పలుచోట్ల చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. దుమ్ము రోడ్లపై సుడులు తిరుగుతూ కొద్దిసేపు భయపెట్టింది. ఉదయం నుంచి ఎండ తీవ్రతతో ఇబ్బంది పడ్డ జనం వాతావరణం చల్లగా మారడంతో సేదదీరారు. ఈదురుగాలులకు పలుచోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. సుమారు 20 నిమిషాలకు పైగా గాలుల బీభత్సం కొనసాగింది.

ఆకివీడులో ఈదురుగాలులు

ఆకివీడు: పట్టణంలో ఆదివారం సాయంత్రం వాతావరణం ఒక్కసారిగా మారి ఈదురుగాలులు వీచాయి. ఆకాశం మేఘావృతమై వర్షం కురిసింది. పలు చోట్ల చెట్లకొమ్మలు నేలకొరిగాయి. విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. రాత్రి 9 గంటల వరకూ విద్యుత్ సరఫరా పునరుద్ధరించలేదు.

పెనుగొండలో

పెనుగొండ: ఆదివారం సాయంత్రం పెనుగొండ మండలంలో ఒక్కసారిగా వాతావరణం మారి ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. పెనుగొండ పార్కు వద్ద ఓ చెట్టు చిరు వ్యాపారిపై కూలిపోవడంతో స్వల్ప గాయాలయ్యాయి. పరిసర ప్రాంతాల్లో రహదారులపై చెట్లు విరిగిపడ్డాయి. కొన్ని గ్రామాల్లో విద్యుత్ తీగలు తెగి విద్యుత్ సరఫరాకు ఆటంకం కలిగింది.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

కైకలూరు: కైకలూరులో ఆదివారం సాయంత్రం ఎండ దంచికొట్టగా.. సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. ఈదురుగాలులు వీచాయి. దీంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది.

తణుకు పట్టణంలో

తణుకు టౌన్: ఆదివారం సాయంత్రం వీచిన ఈదురుగాలులకు జనం ఎండ నుంచి కొంత ఉపశమనం పొందారు. ఈదురుగాలుల కారణంగా మండలంలోని గ్రామాల్లోని చెట్ల కొమ్మలు విరిగిపోవడంతో పాటు పలు గ్రామాల్లోని విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. తణుకు రూరల్ మండలం కొమరవరంలో చెట్ల కొమ్మలు విద్యుత్ స్తంభాలపై పడటంతో స్తంభాలు వాలిపోయాయి. అధికారులు, సిబ్బంది సకాలంలో మరమ్మత్తులు చేపట్టి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

ఈదురుగాలుల బీభత్సం

పెంటపాడు: పెంటపాడు మండలంలో ఆదివారం ఉదయం నుంచి ఉక్కపోతతో అల్లాడిన ప్రజలు సాయంత్రం వీచిన ఈదురుగాలులకు సేదతీరారు. పలుచోట్ల చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి.



కైకలూరు: తాలూకా సెంటర్‌లో ఈదురుగాలులకు రేగిన దుమ్ము



పెంటపాడు : ప్రత్తిపాడు జాతీయరహదారిపై జంక్షన్ వద్ద ట్రాఫిక్ నియంత్రించే స్టాండ్ ఈదురుగాలులకు ఎగిరిపోయిన దృశ్యం



పెనుగొండ : తోపుడుబండిపై కూలిన చెట్టు



చింతలపూడి : ఈదురు గాలులకు విద్యుత్ స్తంభంపై కూలిన చెట్టు

కుంకుళ్లమ్మ ఆలయ వార్షికోత్సవాలు ప్రారంభం



ద్వారకాతిరుమల: చినవెంకన్న ఆలయానికి ఉపాలయమై, క్షేత్ర దేవతగా విరాజిల్లుతోన్న శ్రీ కుంకుళ్లమ్మ అమ్మవారి ఆలయ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజులపాటు జరిగే ఈ వేడుకల్లో భాగంగా తొలిరోజు ఆలయంలో గణపతి పూజ, పుణ్యాహవాచనం, రుత్విగ్వరణ, పంచగవ్య ప్రాశన, దీక్షాధారణ అనంతరం అంకురార్పణను ఆలయ అర్చకులు, పండితులు వేద మంత్రోచ్ఛరణల నడుమ వైభవోపేతంగా నిర్వహించారు.

క్రీడలతో దేహదారుఢ్యం



వేల్పుచర్ల క్రికెట్ పోటీల విజేతలకు బహుమతి ప్రదానం చేస్తున్న దృశ్యం

ముసునూరు: క్రీడలు దేహ దారుఢ్యాన్నిస్తే, పాటలు, సంగీతం మానసిక ఉల్లాసాన్ని స్తాయని తెలుగు సినీ గేయ రచయితలు అనంత శ్రీరామ్, గోసాల రాంబాబు పేర్కొన్నారు. గత నెలన్నర రోజులుగా వేల్పుచర్ల గ్రామంలో ఫ్రెండ్స్ క్రికెట్ టోర్నమెంట్ ఆధ్వర్యంలో జరుగుతున్న జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు ఆదివారం సాయంత్రంతో ముగిశాయి. ఈ సందర్భంగా జరిగిన బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమంలో తపన ఫౌండేషన్ వ్యవస్థాపకుడు గారపాటి సీతా రామాంజనేయ చౌదరి గేయ రచయితలతో కలిసి విజేతలకు బహుమతులు అందించారు. క్రీడాకారులను ప్రోత్సహిస్తూ ఫౌండేషన్ ద్వారా పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ఆదివారం సాయంత్రం విజయరాయి టీం, పోణంగి టీంల మధ్య ఫైనల్ పోటీ ఆద్యంతం రసవత్తరంగా సాగింది. విజయరాయి జట్టు ప్రథమ స్థానం సాధించగా, పోణంగి టీమ్ ద్వితీయ స్థానం, వేల్పుచర్ల టీమ్ తృతీయ స్థానం సాధించాయి. కార్యక్రమంలో సర్పంచ్ పుట్ల మోహనరావు, ఎంపీటీసీ గరికిముక్కు సుబ్బారావు, బర్మా ఫణిబాబు వ్యక్తిగత బహుమతులు, ట్రోఫీలను బహూకరించారు.

గడపగడపకు సంక్షేమం



తాడేపల్లిగూడెం రూరల్: అప్పారావుపేట గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

నగలు, నగదు చోరీ



చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న సీసీఎస్ సీఐ మురళీకృష్ణ

ఏలూరు టౌన్ : ఏలూరు తంగెళ్ళమూడి ప్రాంతంలో ఇంటి యజమానులు ఊరుకెళ్ళిన సమయంలో దొంగలు చొరబడి నగలు, నగదు దోచుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తంగెళ్ళమూడి రామాలయం వీధికి చెందిన పెద్దిబోయిన శశిరేఖ, సత్యనారాయణ దంపతులు వారం రోజుల క్రితం తాడేపల్లిగూడెంలో ఉంటున్న కుమార్తె ఇంటికి వెళ్లారు. ఇదే అదనుగా తాళాలు పగలగొట్టి దొంగలు లోపలికి చొరబడ్డారు. బీరువా తలుపులు పగలగొట్టి రూ.30 వేల నగదు, సుమారుగా 8 కాసుల బంగారు ఆభరణాలు అపహరించారు. ఆదివారం ఇంటికి వచ్చిన శశిరేఖ, సత్యనారాయణలు జరిగిన విషయాన్ని గ్రహించారు. సమాచారం అందుకున్న ఏలూరు సీసీఎస్ సీఐ సీహెచ్ మురళీకృష్ణ, ఏలూరు టూటౌన్ సీఐ పీ.చంద్రశేఖర్ తమ సిబ్బందితో వెళ్లి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



దెందులూరు: జాతీయ రహదారిపై గుండుగొలను వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కొమిరేపల్లి గ్రామానికి చెందిన వెల్డర్ డీ రాంబాబు అక్కడికక్కడే మృతి చెందాడు. కానిస్టేబుల్ గోపి తెలిపిన సమాచారం మేరకు గుండుగొలనులోని చికెన్ షాపు నుంచి చికెన్ తీసుకుని టైర్ల కొట్టు వైపు వెళ్తుండగా బొలేరో వాహనం రాంబాబుపై నుంచి వెళ్ళిపోయింది. వాహనాన్ని వెంబడించి కొంత దూరం వెళ్ళిన తరువాత పట్టుకున్నారు. బొలేరో డ్రైవర్‌ను స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

జూన్ 21 వరకు ఉచిత యోగా శిక్షణ



యోగా శిక్షణలో పాల్గొన్న వాకర్స్ సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఎయిర్‌స్ట్రిప్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జూన్ 21 ఇంటర్నేషనల్ యోగా డే వరకు వాకర్స్ భవనంలో యోగా అవగాహన శిక్షణ కార్యక్రమాలు ప్రతి రోజు ఉదయం 7.30 గంటల నుంచి 8.30 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు వాకర్స్ అధ్యక్షులు కేవీ చలం చెప్పారు. భవనంలో ఆదివారం నిర్వహించిన యోగా కార్యక్రమంలో గురువు బడుగు చంద్రశేఖర్ యోగా ఆసనాలు, వాటి వల్ల ఉపయోగాలు వివరించారు. కార్యదర్శి కుమారస్వామి, కోశాధికారి పరమాత్మ, కె.నరసింహమూర్తి, వీఎస్ ప్రసాద్, బాకా వెంకటేశ్వరరావు, సారధి, యోహాన్, మోహన్‌రావు, గురుమూర్తి పాల్గొన్నారు.

శానిటరీ కిట్ల పంపిణీ



శానిటరీ కిట్ అందజేస్తున్న బోలెం రామలక్ష్మి, డాక్టర్ అన్నపూర్ణ

తాడేపల్లిగూడెం (టీఓసీ): కౌమార బాలికలు, మహిళలు రుతుస్రావ శుభ్రతపై అవగాహనతో ఉండాలని పట్టణ మహిళా సమాఖ్య అధ్యక్షురాలు బోలెం రామలక్ష్మి అన్నారు. ఆదివారం పట్టణంలోని 4వ వార్డులో కౌమార బాలికలకు, మహిళలకు రుతుస్రావం, పరిశుభ్రత అనే అంశాలపై ఏరియా ఆసుపత్రి గైనకాలజిస్ట్ డాక్టర్ అన్నపూర్ణతో అవగాహన కార్యక్రమం జరిగింది. బాలికలు, మహిళలలో ఉన్న అపోహలను తొలగించేందుకు కౌమార బాలికలను భాగస్వాములు చేసి వారితో వార్డులో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కౌమార బాలికలకు శానిటరీ కిట్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మెప్మా సిబ్బంది, వార్డు సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతతో ఆరోగ్యం



వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన ర్యాలీలో పాల్గొన్న కిశోర బాలికలు, ఐసీడీఎస్ అధికారులు

అత్తిలి: కిశోర బాలికలు వ్యక్తిగత పరిశుభ్రత కలిగి ఉండాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం శ్రీదేవి చెప్పారు. అత్తిలి మండలం గుమ్మంపాడులో ఆదివారం మెన్‌స్ట్రువల్ హైజీన్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో కిశోర బాలికల వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. సూపర్‌వైజర్ శ్రీదేవి మాట్లాడుతూ కిశోర బాలికలు సమతుల ఆహారాన్ని భుజించాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశవర్కర్లు, సూపర్‌వైజర్లు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

బాలికలు పరిశుభ్రత పాటించాలి

పెంటపాడు: బాలికలు, మహిళలు మెరుగైన ఆరోగ్యం కోసం పరిశుభ్రత పాటించాలని మండల ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సీహెచ్ దుర్గా భవాని కోరారు. మహిళల పరిశుభ్రత దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం పలు అంగన్‌వాడీ కేంద్రాల వద్ద కిశోర బాలికలకు, మహిళలకు ప్రత్యేక అవగాహన సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అంశాలను మహిళలకు వివరించారు. సీడీపీవో సరస్వతి ఆదేశాల మేరకు అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఈదురుగాలులతో విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలో ఆదివారం సాయంత్రం వీచిన ఈదురుగాలులకు నిట్ సమీపంలో విద్యుత్ లైన్‌లకు చెట్టు కొమ్మలు తెగి అడ్డుపడటంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. పాతూరు సెమి ఇండోర్ సబ్ స్టేషన్ పరిధిలో పలు ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది చెట్ల కొమ్మలను తొలగించి రాత్రి 8 గంటలకు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

బాలింతకు ఆర్థిక సాయం



నిత్యావసర వస్తువులు, నగదును అందజేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం అర్బన్ : మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో పట్టణానికి చెందిన బాలింత గోతం రమ్యశ్రీకి సహాయార్థం ఆమె తల్లి తిరుపతి వెంకటలక్ష్మికి సంస్థ సభ్యులు నిత్యావసర వస్తువులు, రూ.2 వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు. మిరియాల కిషోర్‌కుమార్, తమరాడ చిన్న, ముప్పిడి సురేష్‌రెడ్డి, సాధనాల త్రిమూర్తులు పాల్గొన్నారు.

ప్రాధాన్యతా రంగాల అభివృద్ధిపై సీఎం దృష్టి

- రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ
- అప్పారావుపేట గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం



అప్పారావుపేటలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం రూరల్: వ్యవసాయం, విద్య, వైద్యం వంటి ప్రాధాన్యత రంగాలపై సీఎం దృష్టి సారించి, వాటిని అభివృద్ధి చేస్తున్నారని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. ఆదివారం సాయంత్రం తాడేపల్లిగూడెం మండలం అప్పారావుపేట గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు చేకూరిన లబ్ధిని వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విత్తనాల నుంచి ధాన్యం విక్రయించే వరకు, ఇన్‌పుట్‌సబ్సిడీ వంటి వాటిని సకాలంలో అందించి రైతుల శ్రేయస్సుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. ప్రతిబిడ్డా చదువుకోవాలనే ఆకాంక్షతో అమ్మ ఒడి పథకాన్ని ప్రవేశపెట్టి చదివిస్తున్నారన్నారు. అలాగే, ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమాన్ని అమలు చేస్తున్నట్టు తెలిపారు. వారంలో ఆరు రోజులు ఆరు రకాల ఆహారాన్ని అందించడం జరుగుతుందన్నారు. ఆరోగ్యశ్రీ ద్వారా పేదలకు ఉచితంగా వైద్యం అందిస్తున్నట్టు తెలిపారు. ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం ద్వారా వైద్యాన్ని గ్రామ స్థాయిలోకి అందుబాటులోకి తీసుకువచ్చారన్నారు. గ్రామాల్లోనే విలేజ్ హెల్త్ క్లీనిక్‌లకు సమీపంలోని పీహెచ్‌సీల నుంచి నెలలో రెండు సార్లు వైద్యులు వచ్చి రోగులకు పరీక్షలు నిర్వహిస్తారన్నారు. అవసరమైన వారికి నెలకు సరిపడా మందులు, ఉన్నత వైద్యం అవసరమైన వారిని నెట్ వర్క్ ఆసుపత్రులకు తరలిస్తున్నారన్నారు. ఒకనాడు వెయ్యి రూపాయలు పింఛన్ తీసుకోవడానికి రోజంతా పడిగాపులు పడవలసిన పరిస్థితి వచ్చేదన్నారు. కూలీపైనే ఆధారపడి జీవించే వారి పరిస్థితి మరింత దారుణంగా ఉండేదన్నారు. నేడు ఆ పరిస్థితి లేదన్నారు. సీఎం వైఎస్ జగన్ ప్రవేశపెట్టిన వలంటీర్ వ్యవస్థ ద్వారా ఉదయాన్నే ఇంటివద్దకే పింఛన్ సొమ్ము అందిస్తున్నారన్నారు. దీనివల్ల పింఛన్‌దారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఒకనాడు వయస్సు పైబడిన తల్లిదండ్రులను చూసేందుకు బిడ్డలు వాటాలు వేసుకునే పరిస్థితి ఉండేదన్నారు. బిడ్డలపై ఆధారపడకుండానే వారే తమ వద్ద ఉండమనే స్థితికి మానవ సంబంధాలను మెరుగుపర్చారన్నారు. ఇదిలాఉంటే అప్పారావుపేట గ్రామంలో లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు ఇస్తుంటే కొంతమంది స్థలాలపై కోర్టు కేసులు వేసి అడ్డుకుంటున్నారన్నారు. అయితే, లబ్ధిదారులకు ఇంటి స్థలం ఇచ్చి ఇల్లు నిర్మించుకునేందుకు చర్యలు తీసుకుంటుందన్నారు. ఇంతటి చక్కటి పాలనను సీఎం వైఎస్ జగన్ అందిస్తుంటే ప్రజలకు ఆశ్చర్యం కలుగుతుందన్నారు. జగన్ నాయకత్వంలో రాష్ట్రం ముందుకెళ్తుందన్నారు. ఈ తరుణంలో చంద్రబాబువంటి వారిని రాజకీయాలనుంచి దూరం పెట్టేలా ప్రజలు మంచి నిర్ణయం తీసుకోవాలన్నారు. ఇదిలా ఉంటే, ఎన్ని ప్రభుత్వాలు వచ్చినా గ్రామంలోని ఎస్సీ ఏరియాలో రోడ్ల నిర్మాణానికి నోచుకోవడం లేదని మంత్రి కొట్టు సత్యనారాయణ వద్ద ఒక మహిళ వాపోయింది. దీంతో ఆయన రోడ్ల నిర్మాణానికి రూ.10 లక్షలు మంజూరు చేస్తున్నట్టు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు ముత్యాల ఆంజనేయులు, వైస్ ఎంపీపీ కట్టా రంగబాబు, ఉప సర్పంచ్ దుర్గారావు, వెంకట్రావు పాలెం సర్పంచ్ ఎలిపే గాంధీ, ఎంపీటీసీ సభ్యులు మార్లపూడి సుబ్బారావు, మట్టా సత్యనారాయణ, కళింగ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ సంపతరావు కృష్ణారావు, కొమ్ముగూడెం సొసైటీ చైర్మన్ వెలిశెట్టి నరేంద్ర కుమార్, తహసీల్దార్ వైకేవీ అప్పారావు, ఇన్‌చార్జి ఎంపీడీవో వీఎస్ వేణుగోపాల్, ఏపీఎం జీవీకేడీఎం లక్ష్మి, పంచాయతీ కార్యదర్శి నరసింహరాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు ముప్పిడి సంపత్‌కుమార్, రాపాక వెంకటేశ్వరరావు, సోమలంక చినవెంకటరత్నం, మాధవరావు, అధికారులు పాల్గొన్నారు.

నేడు బైక్ ర్యాలీ

తణుకు అర్బన్: రాజధాని ప్రాంతంలో నిరుపేద అక్కచెల్లెమ్మలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పంపిణీ చేసిన ఇళ్ల స్థలాలను ప్రతిపక్ష నేత చంద్రబాబు శ్మశాన వాటికతో పోల్చిన నేపథ్యంలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తణుకు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నాయకులు తెలిపారు. రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ఆధ్వర్యంలో సోమవారం ఉదయం 8 గంటలకు తణుకు పార్టీ కార్యాలయం నుంచి ప్రారంభించనున్న ఈ బైక్ ర్యాలీ వేల్పూరు, రేలంగి మీదుగా అత్తిలి వరకు నిర్వహిస్తామన్నారు. నియోజకవర్గంలోని మూడు మండలాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు ఈ ర్యాలీలో పాల్గొనాలని కోరారు.

నేడు ముదునూరులో గడపగడపకు మన ప్రభుత్వం

పెంటపాడు: ముదునూరులో సోమవారం గడపగడపకు ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు పార్టీ మండల శాఖ అధ్యక్షులు కైగాల శ్రీనివాస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 4 గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ ముఖ్యఅతిథిగా పాల్గొంటారన్నారు. అన్నిశాఖల అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, సొసైటీ అధ్యక్షులు నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలి



ఆరవల్లి గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో పాల్గొన్న విద్యార్థులు

అత్తిలి: వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా అత్తిలి శాఖా గ్రంథాలయంలో ఆదివారం పుస్తక పఠనం, పుస్తక సమీక్ష, నీతికథలు చెప్పడంపై శిక్షణ ఇచ్చారు. రిసోర్సుపర్సన్ జి బాలకృష్ణ విద్యార్థులకు దేశ నాయకుల చరిత్ర తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అనర్థాలపై కె కోమలి విద్యార్థులకు వివరించారు. ప్లాస్టిక్ వాడకం వల్ల పర్యావరణానికి ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని, ప్రతి ఒక్కరూ గుడ్డ సంచులను వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్ బాలాజీ, యేసుబాబు, పి వెంకటేశ్వరరావు, రంగినీడి దానకృష్ణ, ఎం దేవి, గ్రంథాలయాధికారి డి కృష్ణారావు పాల్గొన్నారు. ఆరవల్లి శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు టైమ్ మేనేజ్‌మెంట్‌పై మల్లికార్జున్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి సత్తి శ్రీనివాసరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో వేసవి శిబిరం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని గ్రేడ్–1 గ్రంథాలయంలో ఆదివారం వేసవి శిబిరం కొనసాగింది. గ్రంథాలయాధికారి వానపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో విద్యార్థులకు మెడిటేషన్, స్పోకెన్ ఇంగ్లిష్, తెలుగు, జాతీయ జెండా విశిష్టత తదితర అంశాలను బోధించారు. ప్రత్తి వీరాస్వామి, దుర్గమ్మ, ఎస్.సాల్మన్‌రాజు, మహాశివభట్టు లక్ష్మణరాజు, గరికిపాటి బాపయ్య శర్మలు అవగాహన కల్పించారు. దాత పి.భాస్కరరావు పాల్గొన్నారు.

ఉత్సాహంగా వేసవి శిక్షణ శిబిరాలు

తణుకు టౌన్: గ్రంథాలయాల ఆధ్వర్యంలో ప్రభుత్వం చేపట్టిన వేసవి శిక్షణ శిబిరాల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆదివారం తణుకులో బ్యాంక్ కాలనీలోని పురుషుల శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు కథల పుస్తకాలు చదవడం, విద్యార్థులతో కథలు చెప్పించడం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. తణుకులోని మహిళా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో విద్యార్థులకు యర్రమిల్లి ప్రభాకర్ చేతి రాత పోటీలు నిర్వహించారు. అనంతరం క్రాఫ్ట్ పేపర్‌తో బొమ్మలు తయారు చేసే విధానం, భగవద్గీత శ్లోకాలను నేర్పించడం, నీతి కథలు చెప్పించడం, కథలు చదవడం ఇంగ్లీష్ పదాలకు అర్థాలు చెప్పించడం, చెస్ బిజినెస్, అంత్యాక్షరి వంటి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రచయిత్రి యర్రమిల్లి విజయలక్ష్మీ, రిసోర్సు పర్సన్ జే అలకనంద, గ్రంథాలయ అధికారి ఎస్ ప్రవీణ పాల్గొన్నారు. తణుకు రూరల్ మండలం వేల్పూరులోని జిల్లా గ్రంథాలయంలో నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరంలో విద్యార్థులతో కథల పుస్తకాలు చదివించడం, పుస్తక సమీక్ష, ఇంగ్లీష్ పదాలకు అర్థాల వివరణ, వంటి వాటితో పాటు కథలు చెప్పడం, యోగ శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. రిటైర్డ్ ఎంఈవో కోరా సత్యనారాయణ, రిటైర్డ్ ఏఈ కేఆర్ చక్రధరరావు, గ్రంథాలయ అధికారి వైవీ సాయిబాబు పాల్గొన్నారు.

ఉత్సాహంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనాలు



పెంటపాడు డిగ్రీ కళాశాల పూర్వ విద్యార్థులు



విప్పర్రు జెడ్పీస్కూల్లో ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

పెంటపాడు: మండలంలో పెంటపాడు, విప్పర్రు గ్రామాలలో ఆదివారం పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాలు ఉత్సాహంగా జరిగాయి. పెంటపాడు వాసవి సేవాభవనంలో 1996–99 విద్యా సంవత్సరంలో బీఎస్సీ చదివిన పూర్వ విద్యార్థులు తొలిసారిగా కలిశారు. జువాలజీ అధ్యాపకులు రామారావు, కెమిస్ట్రీ అధ్యాపకులు విశ్వనాథరాజు, ఫిజిక్స్ అధ్యాపకులు సుబ్బారావు తదితరులను ఘనంగా సన్మానించారు. సుమారు 70 మంది విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. విప్పర్రు జెడ్పీ హైస్కూలులో 1997లో పదోతరగతి చదివిన పూర్వ విద్యార్థులు జెడ్పీ హైస్కూలులో ఆదివారం కలుసుకున్నారు. అప్పటి ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉత్సాహంగా గడిపారు. సహపంక్తి భోజనాలు చేశారు.

నేటి నుంచి వరాల వెంకన్న బ్రహ్మోత్సవాలు



విశేష అలంకరణలో వరాల వేంకటేశ్వరస్వామి

అత్తిలి: ఈడూరులో శ్రీదేవి, భూదేవి సమేత వరాల వేంకటేశ్వరస్వామి కల్యాణ బ్రహ్మోత్సవాలు నేటి నుంచి ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఆలయ ప్రాంగణంలో చలువ పందిళ్లు నిర్మించి, స్వాగత ద్వారాల నుంచి విద్యుత్ దీపాలతో దేవతామూర్తుల సెట్టింగ్‌లను ఏర్పాటు చేసారు. భక్తుల కోరిన కోర్కెలు తీర్చే స్వామివారిగా ప్రసిద్ధిగాంచిన వరాల వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాలు ఏటా అంగరంగ వైభవంగా నిర్వహిస్తుంటారు. సోమవారం ఉదయం సన్నిధినాగ వెంకటసత్య సూర్యరామలింగేశ్వరరావు, వీరపద్మ, మామిడిపల్లి రాంబాబు, నాగమణి దంపతులతో స్వామివారికి సుప్రభాతసేవ, మేలుకొలుపు, తోమాలసేవ నిర్వహిస్తారు. అనంతరం స్వామివారిని పెళ్లి కుమారుడిగా, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లను పెళ్లి కుమార్తెలుగా ముస్తాబు చేస్తారు. సాయంత్రం అల్లూరి మోహన మురళీరాజు, మాధురి దంపతులతో ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహిస్తారు. ఈనెల 30న రాత్రి గజవాహన సేవ అనంతరం స్వామివారి కల్యాణం నిర్వహించనున్నట్టు అర్చకు లు వాడపల్లి శేఖరాచార్యులు, ఆలయ ఈవో పిల్లి సూర్యనారాయణ తెలిపారు. 31వ తేదీన స్వామి వారి తీర్థ మహోత్సవం, అఖండ అన్నసమారాధన, రథోత్సవం నిర్వహిస్తారు. జూన్ 1న సింహవాహనసేవ, వేంకటేరస్వామివారి సంబరం, 2న సుదర్శన హోమం, గరుడవాహన సేవ, 3న శేషవాహన సేవ, 4న పూర్ణాహుతి, చక్రస్నాన కార్యక్రమంతో శ్రీస్వామివారి కల్యాణోత్సవాలు ముగుస్తాయని వారు చెప్పారు. శ్రీస్వామివారి కల్యాణోత్సవాలకు హాజరయ్యే భక్తులకు అన్ని ఏర్పాట్లు చేసామని ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ పెన్మెత్స ప్రభాకర కోటి రామలింగరాజు తెలిపారు.

బాలికా విద్యపై అవగాహన ర్యాలీ



పైడిపర్రులో అవగాహన ర్యాలీ

తణుకు టౌన్: బాలికా దినోత్సవం సందర్భంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో కిషోర బాలికలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆదివారం తణుకు పైడిపర్రు సెక్టార్ పరిధిలోని తేతలి, దువ్వ, ముద్దాపురం, కోనాల గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో బాలికలకు పరిశుభ్రతపై, విద్య, వివిధ అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సందర్భంగా దువ్వ, పైడిపర్రు తదితర కేంద్రాల ఆధ్వర్యంలో గ్రామాల్లో అవగాహన ర్యాలీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్ వైజర్‌లు సీహెచ్ వెంకటలక్ష్మీ, కృష్ణకుమారి, అంగన్‌వాడీ కేంద్రాల వర్కర్లు, ఆయాలు, కిషోర బాలికలు పాల్గొన్నారు.

అధిక ఫీజుల వసూలుపై చర్యలు తీసుకోవాలి

తణుకు: కార్పొరేట్, ప్రైవేటు స్కూల్స్, కాలేజీల్లో నిబంధనలకు విరుద్ధంగా అధిక ఫీజులు వసూలు చేస్తున్న యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని అఖిలపక్షం రౌండ్ టేబుల్ సమావేశం డిమాండ్ చేసింది. సీపీఎం ఆధ్వర్యంలో స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశానికి సీపీఐ పట్టణ కార్యదర్శి బొద్దాని నాగరాజు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కార్పొరేట్, ప్రైవేట్ విద్యా సంస్థల్లో ప్రభుత్వ నిబంధనలు పాటించని యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యాసంస్థల్లో బుక్స్, యూనిఫాం వంటివి విక్రయించకూడదనే నిబంధనలు ఉన్నప్పటికీ యాజమాన్యాలు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. సీపీఎం పట్టణ కార్యదర్శి పీవీ ప్రతాప్, కాంగ్రెస్ పట్టణ కార్యదర్శి దిర్శిపో రామకృష్ణ, నాయకులు కొరు వెంకటేశ్వర్లు, కామన మునిస్వామి, గార రంగారావు, పి.దక్షిణామూర్తి, గుబ్బల గోపి పాల్గొన్నారు.

జీవితంలో ఆనందం, సంతృప్తి ముఖ్యం



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సమితి అధ్యక్ష, కార్యదర్శులు, సభ్యులు

తణుకు టౌన్: జీవితంలో ఆనందం, సంతృప్తి ముఖ్యమని, భార్యాభర్తలు, పిల్లలు బంధువులతో సత్సంబంధాలు నెలకొల్పుకోవడం ద్వారానే మంచి సమాజం ఏర్పడుతుందని ప్రముఖ సైకాలజిస్ట్ కె శివశంకర్ చెప్పారు. ఆదివారం తణుకు రామకృష్ణ సేవా సమితి భవన్‌లో వివేకానంద హ్యూమన్ ఎక్సలెన్ సెంటర్, సెంటర్ ఫర్ హోలిస్టిక్ డవలప్‌మెంట్ ఆఫ్ హ్యూమన్ కాన్షియస్‌నెస్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన జీవన విద్య కార్యశాల కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్య జీవితంలో భార్యాభర్తలలో ఏర్పడే ఆందోళన, కోపం, చిరాకు, వంటి వాటిని ఎలా ఎదుర్కోవాలో వివిధ కృత్యాల ద్వారా వివరించారు. బంధువులు, జీవిత భాగస్వామితో సరైన సంబంధాలు పెంపొందించుకునే వివిధ చర్య, ప్రతిచర్యలను వివరించారు. పిల్లలు తల్లిదండ్రుల మధ్య సంబంధాలు మెరుగుపర్చుకునేందుకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ సైకాలజిస్ట్ అక్కింశెట్టి రాంబాబు రచించిన భార్య, భర్త సైకాలజీ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ సేవా సమితి గౌరవ అధ్యక్షుడు మల్లిన రామచంద్రరావు, అధ్యక్షుడు బోగవల్లి శ్రీమన్నారాయణ, కార్యదర్శి చిలుకూరి రామకృష్ణ, కన్వీనర్ చిలుకూరి సుజాత, కోఆర్డినేటర్ కె గిరీశ్వరరావు, డాక్టర్ అశోక్‌రెడ్డి, కే జయానంద్, అఖిల్, రామకృష్ణ సేవా సమితి సభ్యులు, ఉపాధ్యాయులు, వివిధ వృత్తి, వ్యాపారులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలకు సిద్ధం

- ముదునూరు పీహెచ్‌సీ ఆధునికీకరణ పూర్తి
- నేడు ప్రారంభించనున్న డిప్యూటీ సీఎం, కలెక్టర్



ముదునూరులో నూతనంగా నిర్మించిన పీహెచ్‌సీ భవనం

పెంటపాడు: ముదునూరు గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నూతన భవనం సర్వాంగ సుందరంగా రూపుదిద్దుకుంది. గతంలో ఇక్కడ ఉన్న పాత భవనం శిథిలావస్థకు చేరడంతో కొన్నేళ్ల క్రితం పీహెచ్‌సీని స్థానిక ప్రభుత్వ పాఠశాలకు తరలించారు. అక్కడ సరైన సౌకర్యాలు లేక రోగులు, సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడేవారు. అయినా అక్కడ నిపుణులైన వైద్యులు ఉండటంతో అన్ని వ్యాధులకు చికిత్స చేయడంతో పాటు, కరోనా సమయంలో సిబ్బంది మెరుగైన సేవలు అందించారు. కాగా ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ కృషితో రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.1.49 కోట్లు మంజూరు చేయించారు. ప్రస్తుతం నిర్మించిన ఆస్పత్రి కొత్త భవనంలో రెండు డాక్టర్ గదులు, ఒక ఫార్మసీ, స్టాఫ్ నర్సు రూమ్, ల్యాబ్, ఆయుష్ డాక్టర్ గది, వార్డులు–2, ఆపరేషన్ థియేటర్–1, డెలివరీ రూం–1 ఆఫీసు రూంతో పాటు, ఐఎల్ఆర్ (వాక్సినేషన్) గది, రోగులు వేచిఉండే వరండాతో సర్వాంగ సుందరంగా నిర్మించారు. కాగా ప్రహరీ, ఇంకా ఇతర చిన్నపాటి పనులు చేపట్టాల్సి ఉంది. ఇప్పటివరకు పీహెచ్‌సీలో డెలివరీలు, ఆపరేషన్‌ల చేసే అవకాశం లేక ఏరియా ఆసుపత్రికి రిఫర్ చేసేవారు. ఇప్పుడు ఆ ఇబ్బందులు తొలగాయి. నూతన పీహెచ్‌సీ వల్ల నేరుగా ఇక్కడే ఆపరేషన్‌లు చేసేందుకు వీలవుతుంది.

నేడు ఆస్పత్రి ప్రారంభానికి ఏర్పాట్లు పూర్తి

ముదునూరు గ్రామంలో సోమవారం గడపగడపకు ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ, జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి చేతుల మీదుగా ముదునూరు పీహెచ్‌సీ భవనం ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు.